క్లుప్తంగా

124 మందికి ఉచితంగా రక్త పరీక్షలు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

రోలుగుంట: మండలంలోని నిండుగొండలో చైల్డ్ లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. 124 మంది నుంచి ఎంఎల్‌పీహెచ్ లోవలక్ష్మి, జోనల్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ రక్తనమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా టీబీ, హెచ్‌ఐవీ వ్యాధుల గురించి చైల్డ్ లింక్ వర్కర్ స్కీం కౌన్సెలర్ మలసాల గణేష్ వివరించారు.

వినాయకుని ఆలయంలో విశేష పూజలు



హోమం చేస్తున్న భక్తులు

రావికమతం: టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామికి బుధవారం పంచామృతాలు,పండ్లరసాలతో ప్రత్యేక అభిషేకం పూజలు,హోమం నిర్వహించారు. సంకట హరచతుర్థి సందర్భంగా పలువురు దంపతులతో అర్చకులు లక్ష్మణరావు విశేష పూజలు, హోమం చేయించారు.

చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక

దేవరాపల్లి: ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించేలా వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.హారిక సూచించారు. పీహెచ్‌సీలో బుధవారం ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు తదితర వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. ముందుగా గ్రామాల్లో ప్రజలకు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం



గౌరీ పరమేశ్వరులకు పూజలను నిర్వహిస్తున్న భక్తులు

కె.కోటపాడు : స్థానిక గౌరీ పరమేశ్వరుల ఆలయ 8వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు గౌరీ పరమేశ్వరులకు పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఉగాది రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు రంగరాజు ,శేషగిరిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

‘పల్లె’వించిన ప్రగతి



తాటిపర్తిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతు భరోసా కేంద్రం భవనం

- నేడు రూ.10.40 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు.
- తాచేరుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన
- హాజరు కానున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: గ్రామ స్వరాజ్యం సాధనే లక్ష్యంగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పల్లెల రూపురేఖలు మారాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామాలు వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రగతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. నాడు టీడీపీ పాలనలో జిల్లాలో వెనకబడిన నియోజకవర్గాల జాబితాలో ఉన్న మాడుగుల నియోజకవర్గంలో ఇప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతోంది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు చొరవతో గత నాలుగున్నర ఏళ్లలో ఊహకందని విధంగా అభివృద్ధి పనులు జరిగాయి. రోడ్లంటే తెలియని, వెనుకబడి ఉన్న గ్రామీణ ప్రాంతాలకు ప్రగతి బాటలు నిర్మించారు. ఏ గ్రామం వెళ్లినా గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలతో ఇతర అభివృద్ధి పనులు దర్శనమిస్తున్నాయి. తాజా మాగుడుల మండలంలో రూ.10.40 కోట్లతో మూడు గ్రామాల్లో పూర్తి చేసిన ప్రభుత్వ భవనం, ఇంటింటి కుళాయిలు, సీసీ రోడ్డు, డ్రైనేజీలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు గురువారం ప్రారంభించనున్నారు. మాడుగుల పట్టణంలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.9.92 కోట్లతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు, సాగరం పంచాయతీ సురవరంలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.10 లక్షలో నిర్మించిన డ్రైనేజీ, తాటిపర్తిలో రూ.23 లక్షలతో పూర్తి చేసిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభించనున్నారు. మాడుగుల పట్టణం, సాగరం కాలనీకి మధ్యలో తాచేరు నదిపై రూ.3.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంతెనకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు.



సాగరం పంచాయతీ సురవరంలో ప్రారంభించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీలు

తాగు నీటికష్టాలు తీరాయి



ఇన్నాళ్లకు మాడుగుల పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు తీరుతున్నాయి. గతంలో నీటి సరఫరాకు తాచేరు నది నుంచి వేసిన గొట్టాలు తరుచూ మరమ్మతులకు గురయ్యేవి. దీంతో తాగు నీటికి ఇబ్బందులు పడేవారం. ప్రస్తుతం కరక్‌పూర్ నుంచి పటిష్టమైన గొట్టాలను భూమిలోంచి ఏర్పాటు చేశారు. గతంలో పట్టణంలో 6 మంచి నీటి పథకాలుండేవి. ప్రస్తుతం నూతనంగా 2.20 లక్షల లీటర్ల సామర్థ్యంగల మరో మూడు రక్షిత మంచి నీటి పథకాలతో పాటు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. మరో 100 ఏళ్ల వరకు తాగు నీటికి కష్టాలు లేకుండా పనులు చేయించిన డిప్యూటీసీఎం బూడి ముత్యాల నాయుడికి రుణపడి ఉంటాం .

–బంగారు మణి, 6 వ వార్డు . మాడుగుల పట్టణం

రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు



తాతలు, తండ్రుల కాలం నుంచి తాచేరు దాటలేక, చేను, చెట్టు, వదులుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో నరకయాతన అనుభవిస్తున్నాం. చాలా మంది నాయకులు తాచేరుపై వంతెన నిర్మిస్తామని హామీలు ఇవ్వడమే తప్ప పనులు చేయించలేదు. మాడుగుల పట్టణంలోని 30 కుటుంబాలకు చెందిన వారి పాకలు,పొలాలు తాచేరు అవతల ఉన్నాయి. మండల కేంద్రం మాడుగులకు వచ్చేందుకు 20 గ్రామాల ప్రజలు కూడా తాచేరు మీదుగానే దగ్గరదారి అవుతుంది. మా కష్టాలు గమనించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తాచేరుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. శంకుస్థాపను కూడా చేస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

–కర్రి ఈశ్వరరావు, రైతు, మాడుగుల

ఘనంగా టైలర్స్ డే



టైలర్ల దినోత్సవంలో మాట్లాడుతున్న ఆసంఘ ప్రధాన కార్యదర్శి పలివెల శ్రీనివాసరావు



దేవరాపల్లిలో కేక్ కట్ చేసి సందడి చేసిన టైలర్లు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో టైలర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీ ఉమామహేశ్వరీ దేవి టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సంఘం అధ్యక్షుడు ఉప్పు శంకరరావు కేక్ కట్ చేశారు. ఉదయం నుంచి టైలర్లు కుటుంబ సమేతంగా ఆటపాటలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం వేడుకుల్లో పాల్గొన్న టైలర్లు అందరికీ టైలరింగ్ సామగ్రిని అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు వానపల్లి ప్రసాద్, సెక్రటరీ ఇంజరపు శ్రీను, క్యాషియర్ పి.గణేష్ తదితర టైలర్లు పాల్గొన్నారు.

50 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలి

మాడుగుల: వయసు పైబడిన టైలర్లకు కంటి చూపుతగ్గుతోందని, పని కూడా రోజురోజుకు తగ్గిపోతున్నందున, 50 ఏళ్లుదాటిన టైలర్లకు పింఛను మంజూరు చేసి, ఆదుకోవాలని జిల్లా టైలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పలివెల శ్రీనివాసరావు కోరారు. స్థానిక పాల కేంద్రంలో ఏర్పాటు చేసిన దర్జీల దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఒమ్మి నాగేశ్వరరావు, రాఖీశ్రీను, వి.రమణ, రామచంద్రరావు, విజయ భాస్కర్, కార్తీక్, పి. కె. కొండలరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సేవలందించాలి

- వలంటీర్లకు సన్మానం



వలంటీర్ల సత్కారం సభలో సర్పంచులు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నాతవరం: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు ప్రజలకు సేవలు అందించాలని పెదగొలు గొండపేట సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు తమరాన సత్యనారాయణ అన్నారు. మండలంలో పెదగొలుగొండ పేట సచివాలయంలో బుధవారం రాజుపేట అగ్రహారం, చినగొలుగొండపేట, పెద గొలుగొండపేట పంచాయతీల్లో సేవలందిస్తున్న వలంటీర్లను ఘనంగా సత్కరించారు. 20 మంది వలంటీర్లల్లో ఒమ్మి నూకరాజుకు సేవారత్న పురస్కారం అందజేశారు. షీల్డ్‌తో పాటు రూ.25వేలు నగదును అందజేశారు. సేవా మిత్ర పురస్కారాల్లో భాగంగా ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున నగదు అందజేశారు.ఈకార్యక్రమంలో రాజుపేట అగ్రహారం , చిన గొలుగొండపేట సర్పంచ్‌లు గుడుపర్తి సీతయ్యమ్మ, అంకంరెడ్డి నూకాలమ్మ పీకే గూడెం పీఏసీఎస్ డైరెక్టరు గుడుపర్తి అచ్చియ్యనాయుడు, చినగొలుగొండపేట వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంకంరెడ్డి రాజు పంచాయతీ కార్యదర్శి శ్రీను సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శివాలయంలో ధ్వజ స్తంభం ఏర్పాటు



హోమం వద్ద వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగోపీ, ఆలయ కమిటీ సభ్యులు



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

నాతవరం: మండలంలోని చమ్మచింత గ్రామ సమీపంలో తాండవ నది ఒడ్డున ఉన్న శివాలయంలో బుధవారం ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. త్వరలో జరగనున్న మహాశివ రాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల కోరిక మేరకు ఆలయ కమిటీ సభ్యులు ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభాన్ని దర్శించేందుకు చుట్టు పక్కల గ్రామాలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగ గోపి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ డే వేడుకలు

జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని (నేషనల్ సైన్స్ డే)ను అన్ని పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.




తూటిపాలలో నమూనాల ప్రదర్శనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఎంఈవో-1 బి.పడాల్‌దాస్, ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత ఆధ్వర్యంలో సైన్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. కాశీపురం, తెనుగుపూడి, ఎం. అలమండ హైస్కూల్‌లో సైన్స్ డే వేడుకలను నిర్వహించారు.

మాడుగుల రూరల్: వీరనారాయణం హైస్కూలులో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో 25 ప్రాజెక్టులను ప్రదర్శించారు. యల్లపు విజయలక్ష్మి ప్రదర్శించిన డోంట్ యూజ్ ద ప్లాస్టిక్ అన్న నమూనాకు ప్రథమ బహుమతి, యల్లపు జస్వంత్ టీమ్ ప్రదర్శించిన నమూనాకు ద్వితీయ బహుమతి లభించాయి. సైన్సు ఉపాధ్యాయురాలు వి.సుజాత తదితరులు పాల్గొన్నారు. కె.జె.పురం హైస్కూలులో జరిగిన జాతీయ సైన్సు దినోత్సవంలో హెచ్‌ఎం వి.దాసు, సైన్సు ఉపాధ్యాయులు సారథ్యంలో సైన్సు ఎగ్జిబిషన్ నిర్వహించారు. మండలంలో జి.అగ్రహారం, వి.వి.అగ్రహరం, కింతలి, ఒమ్మలి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



నర్సీపట్నంలో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో



డి.యర్రవరంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్



ఎ. కొత్తపల్లి హైస్కూల్‌లో రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం స్వర్ణలత



గ్లోబల్ వార్మింగ్,గాలి కలుషితంపై వివరిస్తున్న చినపాచిల హైస్కూల్ విద్యార్థులు



ప్రథమ బహుమతి సాధించిన ప్రాజెక్టు నమూనా

కె.కోటపాడు : కింతాడ కస్తూర్బా పాఠశాలలో బుధవారం సైన్స్‌డేను ఘనంగా నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతికి చెందిన విద్యార్థినులు పలు ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శించారు. సైన్స్ పాఠ్యాంశాలపై విద్యార్థినులకు క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి.చిన్నమ్ములు పాల్గొన్నారు.

రావికమతం: పలు ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. టి.అర్జాపురం, చినపాచిల,కొత్తకోట పాఠశాలల విద్యార్థులు బయో టాయిలెట్స్, హైడ్రోలిక్ బ్రిడ్జి,సోలార్ స్మార్ట్ సిటీ,గ్లోబల్ వార్మింగ్,సౌరశక్తితో వ్యవసాయం, తక్కువ ఖర్చుతో ఎల్ఈడీ విద్యుత్ దీపాల వెలుగులు, విండ్ పవర్,మానవ శరీర భాగాలు పనితీరు తదితర పలు నమూనాలను ప్రదర్శించారు. కొత్తకోట హైస్కూల్‌లో సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, స్కూల్ చైర్మన్ నానాజీ తదితరులు నివాళులర్పించారు.

మాకవరపాలెం: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో మరింత విజ్ఞానం పెరుగుతుందని కస్తూర్బా పాఠశాల ఎస్‌వో త్రివేణి, తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కోసూరు రాము అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నమూనాలను ప్రదర్శించారు.

నర్సీపట్నం: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ దోహదపడుతుందని ఆర్డీవో హెచ్.వి.జయరాం అన్నారు. శ్రీదుర్గా శాంతినికేతన్ కిడ్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఆర్డీవో, వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు డి.గోపినాథ్, విద్యార్థుల తల్లిదండ్రులు పరిశీలించారు.

నాతవరం: నాతవరం, డి.యర్రవరం, చమ్మచింత, తాండవ, గునుపూడి హైస్కూళ్లలో సైన్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా పాఠశాలల విద్యార్థులు తయారుచేసినప్రాజెక్టులనమూనాలుఆకట్టుకున్నాయి.

చోడవరం రూరల్: సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలు ఉన్నత పాఠశాలల్లో సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ... రామన్ చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో సీవీరామన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జరిపారు. పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం రామిరెడ్డి ఆధ్వర్యంలో సీవీరామన్ జయంతిని నిర్వహించారు.

మండలంలోని జుత్తాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈవో ఎన్.జయలక్ష్మి ప్రారంభించారు. హెచ్‌ఎం వి.వి.శేషగిరిరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, సీఆర్‌పీ నాయుడు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో జయలక్ష్మి



వీరనారాయణం హైస్కూలులో రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం జగన్నాథరావు



చోడవరం డిగ్రీ కళాశాలలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పోస్టల్ పథకాలపై విస్తృత ప్రచారం



రావికమతంలో ఇంటింటికీ వెళ్తున్న పోస్టల్ అధికార్లు, సిబ్బంది

రావికమతం: జనంలోకి మనం పేరుతో పోస్టల్ అధికారులు, సిబ్బంది రావికమతంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పోస్టల్ శాఖలో ఉన్న మేలైన పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేస్తున్నట్టు నర్సీపట్నం సౌత్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ ఉంటే పోస్టాఫీసులో సునాయాసంగా ఖాతా ప్రారంభిస్తామని చెప్పారు. బ్యాంకులు కంటే ఎక్కువ వడ్డీ చెల్లిస్తామని, ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. . ఈ కార్యక్రమంలో మెయిల్ అధికారి శ్రీనివాస్, స్థానిక సిబ్బంది నర్సింహమూర్తి,సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ గొడవను రాజకీయం చేయడం తగదు

- టీడీపీ నాయకుడు విజయ్‌పై వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ రామకృష్ణ

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని 28వ వార్డులో ఓ కుటుంబంలో తొమ్మిదేళ్లగా నలుగుతున్న గొడవను మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ రాజకీయం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, వార్డు ఇన్‌చార్జి సూర్యచంద్ర, కౌన్సిలర్ సిరసపల్లి నాని మాట్లాడుతూ ఆయన వ్యవహారశైలి మార్చుకోవాలన్నారు. గొడవ గురించి కనీస అవగాహన లేకుండా విజయ్ విమర్శలు చేయడం తగదన్నారు. ఇంటి స్థలం గురించి అత్త, కోడలు కొన్ని సంవత్సరాలగా గొడవలు పడుతూ, కేసులు కూడా పెట్టుకున్నారు.అత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యుత్ సిబ్బంది మీటరు తొలగిస్తే అదేదో ఎమ్మెల్యే చేయించినట్టు ఆరోపణలు చేయడం విజయ్‌కు తగదన్నారు. ఐదేళ్లకొకసారి ఉనికిని చాటుకునేందుకు చిల్లర రాజకీయాలు చేయడం విజయ్‌కు పరిపాటిగా మారిందన్నారు. కనీసం గొడవ గురించి అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. పేటీఎం బ్యాచ్‌ను వెంటబెట్టుకొని చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని హితువు పలికారు. ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీ తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో మీ రౌడీ బ్యాచ్ కొత్తవీధిలో ఇద్దరు ఆడపిల్లలతో నివాసం ఉంటున్న మహిళ ఇంటికి వెళ్లి బీభత్సం చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రంగురాళ్ల వ్యాపారులను తుపాకీతో బెదిరించింది నువ్వా కాదా అని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోకపోతే విజయ్ ఇంటిని ముట్టడిస్తామని, వచ్చే ఎన్నికల్లో మీ కుటుంబానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని చెప్పారు.

విద్యుత్ వైర్లతో పొంచి ఉన్న ప్రమాదం

- బాలుడు మృతి చెందినా స్పందించని అధికార్లు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్‌లో వేలాడుతున్న విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదం పొంచి ఉంది. జంక్షన్‌లో వీరవల్లి వెళ్లే రహదారిలో కర్రల మిషన్ గేటును ఆనుకుని కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా వైర్లు ఉన్నాయి. ఎవరైనా ఏమరుపాటుగా చేయి వేస్తే విద్యుత్‌షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. మూడు రోజుల కిందట ఈ వైర్లు పక్కనే మేడమీద ఆడుకుంటున్న ఐదవ తరగతి విద్యార్థి యువరాజ్ సింగ్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత అధికార్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ప్రజావేదిక

మాకవరపాలెం: ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై గురువారం ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో జాన్‌లింకన్ తెలిపారు. మండలంలో ఏడాది వ్యవధిలో జరిగిన ఉపాధి పనులకు చేసిన ఖర్చు, సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ, పలు అభివృద్ధి పనులపై ఈ నెల 16 నుంచి తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

గొలుగొండ: పాతమల్లంపేట, గొలుగొండ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను నర్సీపట్నం ఆర్డీవో జయరాం బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలపై ఆరా తీశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

రామాలయ నిర్మాణానికి విరాళాలు

గొలుగొండ: సీహెచ్ నాగాపురం గ్రామంలో రామాలయం నిర్మాణానికి స్థానికులు పెద్ద ఎత్తున విరాళాలు అందిస్తున్నట్టు సర్పంచ్ రఘురాం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సహకారంతో టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరు కాగా, రామాలయంలో మరిన్ని సదుపాయాలు కల్పన కోసం బుధవారం స్థానికులు నాగం శ్రీనువాస్ రూ.5వేలు, మర్రి వర హాలదొర కుటుంబ సభ్యులు రూ.5వేలు విరాళంగా అందజేశారు.